సాక్షి
విజయనగరం
ఆదివారం । 2 । జూన్ । 2024



భీమాళి తాండ్ర భలే.. - 8లో

మామిడి సీజన్ వచ్చిందంటే భీమాలి గ్రామంలో సందడే సందడి. ప్రతి ఇంటా చిన్నారుల నుంచి వృద్ధుల వరకు నోరూరించే మామిడి తాండ్ర తయారీలో నిమగ్నమవుతారు.



కూరగాయల సాగు.. లాభాలు బాగు... - 8లో

రైతన్నలకు కూరగాయల సాగు కలిసొస్తోంది. ఏడాది పొడుగునా వివిధ రకాల పంటలు చేతికందుతూ ఆదాయాన్నిస్తున్నాయి.



బీసీజీ టీకాలు శతశాతం వేయాలి

క్షయవ్యాధిని నివారించాలనే ఉద్దేశంతో వయోజనులకు బీసీజీ టీకాలు శతశాతం వేయాలని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి ఎస్.భాస్కరరావు సూచించారు. - 8లో

న్యూస్‌రీల్

కోటదుర్గమ్మ హుండీల ఆదాయం రూ.3.32 లక్షలు



హుండీల ఆదాయాన్ని లెక్కిస్తున్న సిబ్బంది

పాలకొండ: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం పాలకొండ కోటదుర్గమ్మవారి హుండీల ఆదాయాన్ని శనివారం లెక్కించారు. ఏప్రిల్ 29 నుంచి నేటి వరకు 34 రోజులకు రూ. 3,32,757లు ఆదాయం వచ్చినట్టు దేవదాయ ధర్మదాయ శాఖ అధికారులు వై.ఇందిర తెలిపారు. లెక్కింపు కార్యక్రమంలో అర్చకులు, ఆలయ కార్యనిర్వహణాధికారి, భక్తులు పాల్గొన్నారు.

4న మద్యం దుకాణాలు మూసివేత

విజయనగరం అర్బన్: ఓట్ల లెక్కింపు జరిగే జూన్ 4వ తేదీన జిల్లాలో మద్యం షాపులన్నింటినీ మూసివేస్తామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ నాగలక్ష్మి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆ రోజు జిల్లాలోని అన్ని ప్రభుత్వ మద్యం దుకాణాలు, బార్ అండ్ రెస్టారెంట్లు, సంకిలిలోని డీనేచర్డ్ ఇథనాల్ యూనిట్, డీనేచర్డ్ స్పిరిట్ మొలాసిస్ యూనిట్స్ మెథనాల్ యూనిట్లు, కల్లు దుకాణాలను మూసివేయాలని ఆదేశించారు. 3వ తేదీ సాయంత్రం 6 గంటల నుంచి 4వ తేదీ అర్ధరాత్రి 12 గంటల వరకు మూసివేయాలన్నారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియ స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు డ్రైడే నిబంధనలను పాటించాలని ఆ ప్రకటనలో కోరారు. డ్రైడే రోజు మద్యం సేవించడం, కలిగి ఉండం, తాగడం నేరమని, నిబంధనలు అతిక్రమించిన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని చెప్పారు.

వెండి తమలపాకుపై రామాంజనేయ చిత్రం



వెండి తమలపాకుపై శ్రీరామాంజనేయ స్వామి చిత్రం

రాజాం సిటీ: పట్టణంలోని కస్పావీధికి చెందిన మైక్రో ఆర్టిస్టు, స్వర్ణకారుడు ఎం.జగదీష్ వెండి తమలపాకుపై శ్రీరామాంజనేయ స్వామి చిత్రాన్ని చెక్కి ప్రతిభ చాటాడు. హనుమజ్జయంతి సందర్భంగా ఒక గ్రాము వెండి తమలపాకుపై గంట వ్యవధిలో శనివారం ఈ చిత్రాన్ని గీసి అబ్బుర పరిచాడు. దీనిని త్వరలో అయోధ్యలోని బాలరాముడు సన్నిధికి పంపిస్తానని తెలిపాడు.

న్యూరాలజీ విభాగంలో విద్యార్థి ప్రతిభ

- మార్కొండపుట్టికి చెందిన రవిచంద్‌కు 4వ ర్యాంక్



గరుగుబిల్లి: ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (ఎయిమ్స్) న్యూఢిల్లీ ఇటీవల నిర్వహించిన వైద్యవిద్య సూపర్ స్పెషాలిటీ కోర్సులో మార్కొండపుట్టి గ్రామ విద్యార్థి శంబంగి రవిచంద్ ప్రతిభ చూపాడు. న్యూరాలజీ విభాగంలో జాతీయస్థాయిలో నాలుగో ర్యాంకు సాధించాడు. హైదరాబాద్‌లోని ఉస్మానియా మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్ పూర్తిచేసిన తర్వాత బనారస్ హిందూ యూనివర్సిటీలో జనరల్ మెడిసిన్‌ను పూర్తిచేశాడు. రవిచంద్ తండ్రి తిరుపతిరావు వ్యవసాయం చేస్తుండగా, తల్లి జ్యోతీశ్వరి ప్రభుత్వ పాఠశాల టీచర్. కుమారుడు మంచి ర్యాంకు సాధించడంతో తల్లిదండ్రులు సంతోషపడుతున్నారు.

మళ్లీ ఫ్యాన్ హవా!

- దాదాపుగా ఎగ్జాట్ ఫలితాలకు ఎగ్జిట్ పోల్స్ ప్రతిబింబం
- రెండు జిల్లాల్లో వైఎస్సార్‌సీపీ శ్రేణులకు తీపి కబురు
- 4న ఓట్ల లెక్కింపునకు ముందే క్యాడర్‌లో ఉత్సాహం
- అన్ని నియోజకవర్గాల్లో అనుకూల ఫలితాలొస్తాయని అంచనా



సాక్షి ప్రతినిధి, విజయనగరం:

అగ్నివీర్.. ఆరా మస్తాన్.. ఆత్మసాక్షి.. జన్మత్ పోల్.. ఆపరేషన్ చాణక్య... ఏబీపీ సీఓటర్... ఇలా పలు సర్వే సంస్థలు ప్రకటించిన ఎగ్జిట్ పోల్స్‌లో ఒక్కటే ఫలితాలు! 'ఫ్యాన్' మరోసారి సునామీ సృష్టిస్తుందని అంచనా వేసి చెబుతున్నాయి. గత నెల 13వ తేదీన జరిగిన సార్వత్రిక ఎన్నికల సందర్భంగా ఓటర్ల నుంచి సేకరించిన అభిప్రాయాలను క్రోడీకరించి ఈ సంస్థలు శనివారం వెల్లడించాయి. ఏవో ఒకటీ రెండు మినహా మిగతావన్నీ ఒకేతరహా ఫలితాలను అంచనావేస్తూ ఎగ్జిట్ పోల్స్‌ను ప్రకటించాయి. ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి 2019 సార్వత్రిక ఎన్నికల్లో తిరుగులేని ఆధిక్యంతో అధికారాన్ని చేపట్టినా క్షేత్రస్థాయిలో మాత్రం అప్పటి నుంచే 2024 సార్వత్రిక ఎన్నికల్లోనూ సంచలన విజయానికి వ్యూహరచన చేశారు. పక్కా ప్రణాళికతో సంక్షేమ పథకాలను, అభివృద్ధి కార్యక్రమాలను చేస్తూ గత ఐదేళ్లలో ప్రజలకు చేరువయ్యారు. రెండేళ్ల పాటు కరోనా మహమ్మారి ప్రపంచాన్ని వణికించినా రాష్ట్రంలో మాత్రం ఆయన పర్యవేక్షణలో వైద్యసేవలు, సంక్షేమ కార్యక్రమాలు దేశానికి ఆదర్శప్రాయం అయ్యాయి. అందుకే 'మీ ఇంటిలో మంచి జరిగిందంటేనే ఓటు వేయండి' అని ధైర్యంగా అడిగిన వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల మనసులో ఒక దమ్మున్న నాయకుడిగా నిలిచిపోయారు. ఆయన ప్రభుత్వాన్ని మళ్లీ తెచ్చుకోవాలనే సంకల్పంతోనే ఓటర్లు గతంలో కనీవినీ ఎరుగని రీతిలో గత నెల 13వ తేదీన పోలింగ్ కేంద్రాలకు బారులు తీరారని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. అదే రోజున ఓటర్ల నాడి తెలుసుకునేందుకు కొన్ని సర్వే సంస్థలు ఎగ్జిట్ పోల్స్‌కు నడుంబిగించాయి.

విజయం మళ్లీ వారిదే...

రెండు జిల్లాల్లోని గ్రామీణ, గిరిజన ప్రాంతాల్లో ఓటర్లు వైఎస్సార్‌సీపీకే అండగా నిలిచారని ఎగ్జిట్ పోల్స్ తేల్చిచెప్పాయి. ముఖ్యంగా మహిళలు అర్ధరాత్రి వరకూ బారులు తీరి మరీ సంక్షేమ ప్రభుత్వానికే ఓటు వేశారని అంచనా వేస్తున్నాయి. బీసీలు, పేద, అణగారిన వర్గాలు అత్యధికంగా ఉన్న ఈ రెండు జిల్లాల్లో ఫ్యాన్‌దే హవా ఉంటుందని చెప్పకనే చెప్పాయి.



అంతేకాదు వైఎస్సార్‌సీపీ అభ్యర్థులంతా విజయపతాకం ఎగురవేయనున్నారని అంచనా వేశాయి. ఈ ప్రకారం...

- విజయనగరం లోక్‌సభ స్థానం నుంచి బెల్లాన చంద్రశేఖర్ మరోసారి విజయం సాధించనున్నారు. అరకు లోక్‌సభ స్థానంలో కొత్తగా బరిలో నిలిచిన డాక్టర్ తనూజారాణి కూడా గెలుపు సాధించనున్నారు.
- ఉపముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర సాలూరు (ఎస్టీ) నియోజకవర్గంలో వరుసగా ఐదోసారి విజయం సాధించే అవకాశాలు మెండుగా ఉన్నాయి. టీడీపీ కూటమి అభ్యర్థిని మట్టికరిపించి అభిమానుల మనసులో మన్యం పులిగా నిలిచిపోనున్నారు. మరో రెండు ఎస్టీ నియోజకవర్గాలైన కురుపాంలో పాముల పుష్పశ్రీవాణి, పాలకొండలో విశ్వాసరాయి కళావతి హ్యాట్రిక్ విజయాన్ని అందుకోనున్నారు.
- ఎస్సీ రిజర్వ్‌డ్ నియోజకవర్గాలైన పార్వతీపురం, రాజాంలో కూడా వైఎస్సార్‌సీపీ జెండా మరోసారి రెపరెపలాడనుంది. పార్వతీపురంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను పరుగుపెట్టించిన అలజంగి జోగారావు మరోసారి అసెంబ్లీలో అడుగుపెట్టేలా ప్రజలు ఆశీర్వదించినట్టు సర్వేలు తేల్చాయి. రాజాం ప్రజలకు వైద్యసేవలతో చేరువైన డాక్టర్ తలే రాజేష్ కూడా ఈ ఎన్నికల్లో తొలిసారిగా విజయం సాధించనున్నారు.
- బీసీల జిల్లాలో తమను విస్మరించి అగ్రవర్ణాలకు సీట్లు కేటాయించిన టీడీపీ కూటమికి ప్రజలు ఓటుతో బుద్ధి చెప్పే అవకాశాలు కనిపిస్తున్నాయి. చీపురుపల్లిలో మంత్రి బొత్స సత్యనారాయణ, గజపతినగరంలో బొత్స అప్పలనర్సయ్య, నెల్లిమర్లలో బడ్డుకొండ అప్పలనాయుడు మరోసారి తమ విజయాన్ని నమోదు చేయనున్నారు. బొబ్బిలిలో టీడీపీ కూటమి అభ్యర్థి బేబీ నాయన గెలుపు ఖాయమంటూ ఓ వర్గం గత రెండేళ్లుగా ఊదరగొడుతున్నా క్షేత్రస్థాయిలో ప్రజలు వైఎస్సార్‌సీపీ అభ్యర్థి, సీనియర్ నాయకుడైన శంబంగి వెంకటచిన్న అప్పలనాయుడికే మద్దతు పలికారనే సంకేతాలు వెలువడుతున్నాయి. శృంగవరపుకోటలో కూడా కడుబండి శ్రీనివాసరావు ప్రత్యర్థుల ఆశలను గల్లంతు చేస్తూ మంచి మెజార్టీతో మరోసారి విజయం సాధించే అవకాశాలు ఉన్నాయని కొన్ని సర్వే సంస్థలు అంచనా వేస్తున్నాయి.
- విజయనగరం జిల్లా కేంద్రంలో పలు అభివృద్ధి పనులతో రూపురేఖలు మార్చేసిన డిప్యూటీ స్పీకర్, వైఎస్సార్‌సీపీ సీనియరు నాయకుడు కోలగట్ల వీరభద్రస్వామి గెలుపు ఖాయమనే క్యాడర్ అంచనాలు వాస్తవమయ్యే అవకాశాలు మెండుగా ఉన్నాయి.

వైఎస్సార్‌సీపీదే పైచేయి...

ఉమ్మడి విజయనగరం జిల్లాతో పాటు కొత్తగా జిల్లాల ఏర్పాటుతో శ్రీకాకుళం జిల్లా నుంచి విలీనమైన రెండు నియోజకవర్గాల్లోనూ వైఎస్సార్‌సీపీ తన ఆధిపత్యాన్ని కొనసాగిస్తుందని ఎగ్జిట్ పోల్స్ చాటిచెబుతున్నాయి. 2019 సార్వత్రిక ఎన్నికల్లో ఫ్యాన్ ఈ రెండు జిల్లాల్లోని 11 అసెంబ్లీ నియోజకవర్గాలతో పాటు వీటి పరిధిలోని మూడు లోక్‌సభ నియోజకవర్గాల్లో క్లీన్ స్వీప్ చేసిన సంగతి తెలిసిందే. ఈనెల 4వ తేదీన వెల్లడికానున్న 2024 సార్వత్రిక ఎన్నికల ఫలితాలు కూడా అదే తరహాలో సునామీని సృష్టిస్తాయని వైఎస్సార్‌సీపీ క్యాడర్‌తో పాటు రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. శనివారం వెల్లడైన ఎగ్జిట్ పోల్స్ కూడా ఇంచుమించు అదే తరహాలో ఫలితాలు ఉంటాయని చాటిచెబుతున్నాయి. ఈ తీపికబురుతో వైఎస్సార్‌సీపీ క్యాడర్‌లో ఉత్సాహం నెలకొంది. 4వ తేదీన కౌంటింగ్‌కు ఎంతో ఉత్సాహంతో సిద్ధమవుతున్నవారిలో ఊపు తీసుకొచ్చింది.

ఉదయం 8 గంటల నుంచే కౌంటింగ్ ప్రారంభం



సమావేశంలో పాల్గొన్న నోడల్ అధికారులు, రిటర్నింగ్ అధికారులు, ఏఆర్‌ఓలు

- వీలైనంత వేగంగా ఓట్ల లెక్కింపు
- జిల్లా ఎన్నికల అధికారి నాగలక్ష్మి

విజయనగరం అర్బన్:

సార్వత్రిక ఎన్నికల లెక్కింపు ప్రక్రియ ఈ నెల 4న ఉదయం 8 గంటలకే ప్రారంభించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ నాగలక్ష్మి రిటర్నింగ్ అధికారులను ఆదేశించారు. కౌంటింగ్ సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, తాజాగా ఎన్నికల కమిషన్ నుంచి వచ్చిన ఆదేశాలను కలెక్టరేట్ సమావేశ మందిరంలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆర్వోలకు తెలియజేశారు. తొలుత పోస్టల్ బ్యాలెట్ కౌంటింగ్ ప్రారంభించాలన్నారు. దీని కోసం 7.30 గంటలకే ట్రంకు బాక్సులు లెక్కింపు కేంద్రాల్లోకి తరలించి, 500 చొప్పున కట్టలు కట్టి టేబుళ్ల వద్దకు చేర్చాలని సూచించారు. ప్రాథమిక లెక్కింపులో మొదటి రౌండ్ గంట సమయం తీసుకున్నప్పటికీ రెండో రౌండ్ నుంచి 45 నిమిషాల్లో పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. రెండో దశలో చేపట్టే పోస్టల్ ఓట్ల సమగ్ర లెక్కింపు ప్రక్రియలో ఒక్కో రౌండ్ లెక్కింపు పూర్తయ్యేందుకు గంటన్నర కంటే ఎక్కువ సమయం తీసుకోకూడదన్నారు. ఈటీపీబీ లెక్కింపు కూడా వెంటనే ప్రారంభించాలని సూచించారు. ఉదయం 7.30 గంటలకు స్ట్రాంగ్ రూమ్‌లను తెరవాలని, ఈ ప్రక్రియను వీడియో రికార్డింగ్ చేయించాలని చెప్పారు. ఉదయం 8.30 గంటలకు ప్రారంభమయ్యే ఈవీఎం ఓట్ల లెక్కింపులో ఒక్కో రౌండ్ 20 నిమిషాలలోపే పూర్తి చేయాలని ఆదేశించారు. అందుకు అనుగుణంగా 8.15 గంటలకే కంట్రోల్ యూనిట్లను కౌంటింగ్ టేబుళ్లవద్దకు చేర్చాలని సూచించారు. ప్రతీరౌండ్ పూర్తయిన వెంటనే ఫలితాలను తప్పులు లేకుండా ఎన్‌కోర్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. నిర్ణీత సమయానికి ఓట్ల లెక్కింపు కార్యక్రమాన్ని ప్రారంభించి సజావుగా వేగంగా ప్రక్రియను పూర్తి చేయాలని కలెక్టర్ కోరారు. కౌంటింగ్ ఏజెంట్లు ఉదయం 6.45 గంటలకల్లా లెక్కింపు కేంద్రాల వద్ద సిద్ధంగా ఉండేలా చూడాలని సూచించారు. ఓట్ల లెక్కింపు పూర్తయ్యాక ఫారమ్-20 రిజల్ట్ షీట్, ఫారమ్-21సీ, ఫారమ్-21ఇ, ఫారమ్-22 తదితర పత్రాలను తప్పులు లేకుండా కచ్చితమైన వివరాలతో పూర్తి చేయాలని ఆదేశించారు. కౌంటింగ్ సెంటర్లలో ఏర్పాట్లన్నీ ఆదివారం సాయంత్రానికి పూర్తి చేయాలని, సిబ్బందికి 3వ తేదీన ప్రత్యక్ష శిక్షణ ఇవ్వాలని సూచించారు. కౌంటింగ్ ముగిసిన తరువాత నిబంధనల ప్రకారం ప్యాకింగ్, సీలింగ్ ప్రక్రియలను పూర్తిచేసి, మరునాడు ఉదయం గోదాములకు తరలించాలన్నారు. పోస్టల్ బ్యాలెట్‌కు సంబంధించి ఎన్నికల కమిషన్ నుంచి వచ్చిన తాజా ఆదేశాలను కలెక్టర్ వివరించారు. సమావేశంలో జేసీ కె.కార్తీక్, డీఆర్వో ఎస్.డి.అనిత, నోడల్ అధికారులు, వివిధ నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులు, ఏఆర్వోలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ ఎస్.నాగమణి, జేసీ కె.కార్తీక్

ఎన్‌సీసీ క్యాడెట్‌లకు ఫైరింగ్ శిక్షణ



ఫైరింగ్ శిక్షణలో ఎన్‌సీసీ క్యాడెట్స్

విజయనగరం అర్బన్:

గాజులరేగ సీతం ఇంజినీరింగ్ కళాశాలలో ఎన్‌సీసీ-2(ఏ) గర్ల్స్ బెటాలియన్ వార్షిక శిక్షణ తరగతులు శనివారం కొనసాగాయి. ఇందులో భాగంగా సారిపల్లి గ్రామంలో సీనియర్ క్యాడెట్స్‌కు ఫైరింగ్‌పై శిక్షణ, జూనియర్ క్యాడెట్స్‌కు ఆరోగ్య అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఫైరింగ్ శిక్షణలో 25 మీటర్ల రేంజ్‌లో 0.22 రైఫిల్స్‌తో కాల్పుల ప్రాక్టీస్ చేయించారు. ఈ సందర్భంగా కల్నల్ గోపీంద్ర మాట్లాడుతూ ఫైరింగ్ శిక్షణ దేశరక్షణకు దోహదపడుతుందన్నారు. జూనియర్ క్యాడెట్స్‌కు ఆరోగ్య జాగ్రత్తలపై రాకోడు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ఎస్.బి.అఖిల అవగాహన కల్పించారు. అనంతరం ఫైరింగ్‌లో ప్రతిభచూపిన పలువురిని ప్రశంసించారు. శిక్షణ తరగతులకు విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాలకు చెందిన 600 మంది ఎన్‌సీసీ క్యాడెట్స్ హాజరయ్యారు. కార్యక్రమంలో డిప్యూటీ క్యాంపు కమాండెంట్ కెప్టెన్ మీసాల సత్యవేణి, సుబేదార్‌మేజర్ బొడ్లే, ఎన్‌సీసీ శిక్షణ అధికారులు మజ్జి వరలక్ష్మి, వెంకట రత్నం, సంతోషి, వరలక్ష్మి, తులసి, లక్ష్మీప్రసన్న, గౌరీ, వెంకట రమణమ్మ పాల్గొన్నారు.

జై హనుమాన్



హనుమంతునికి పూజలు చేస్తున్న భక్తులు

జై శ్రీరామ్.. జై హనుమాన్ నామస్మరణతో విజయనగరం పట్టణం పులకించింది. భక్తిభావం ఉప్పొంగింది. ఆధ్యాత్మిక శోభ వెల్లివిరిసింది. హనుమాన్ జయంతిని పురస్కరించుకుని హిందూ ధర్మ రక్షణ సమితి జిల్లా శాఖ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన శోభాయాత్ర వైభవంగా సాగింది. సాయంత్రం 6 గంటలకు కోట కూడలి వద్ద ప్రారంభమైన శోభాయాత్ర మూడులాంతర్లు, గంటస్తంభం, కన్యకాపరమేశ్వరి ఆలయం, హనుమాన్ జంక్షన్, రైల్వేస్టేషన్ రోడ్డు, ఆర్టీసీ కాంప్లెక్స్, బాలాజీ కూడలి మీదుగా తిరిగి కోటకు చేరుకుంది. శోభాయాత్రలో రథంపై ఉంచిన సీతారామలక్ష్మణ సహిత ఆంజనేయస్వామి ప్రతిమలకు భక్తులు పూజలు చేశారు. భజన బృందాలు భక్తి గీతాలతో అలరించారు.

– విజయనగరం టౌన్



హనుమాన్ జయంతి సందర్భంగా విజయనగరం పట్టణంలో నిర్వహించిన శోభాయాత్ర

తొలిరోజు 87.52 శాతం పింఛన్ల పంపిణీ

- పంపిణీలో జిల్లాకు 4వ స్థానం

విజయనగరం అర్బన్: జిల్లాలో తొలిరోజు శనివారం 81.72 శాతం పింఛన్ల పంపిణీతో విజయనగరం జిల్లా రాష్ట్ర స్థాయిలో నాలుగో స్థానంలో నిలిచింది. ఎన్నికల కోడ్ అమలులో భాగంగా అధిక మంది లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలకు పింఛన్ సొమ్మును జమచేశారు. రోగులు, ఇంటికే పరిమితమైన వృద్ధులు, దివ్యాంగులకు సచివాలయ సిబ్బంది పింఛన్లు అందజేశారు. మొత్తం 72,060 మందికి ఇంటికి వెళ్లి పింఛన్లు అందజేయాల్సి ఉండగా, తొలిరోజు 63,064 మందికి పంపిణీ చేసినట్టు డీఆర్‌డీఏ పీడీ కళ్యాణచక్రవర్తి తెలిపారు. అత్యధికంగా 90 శాతానికి పైగా పంపిణీ చేసి మండలాల్లో రాజాం అర్బన్, జామి, ఎల్.కోట, రేగడి ఆమదాలవలస, బొండపల్లి, వేపాడ, నెల్లిమర్ల అర్బన్ మండలాలు ఉన్నాయి. మిగిలిన అన్ని మండలాల్లో 80 శాతం దాటి పింఛన్ పంపిణీ జరిగిందని పీడీ తెలిపారు.

కౌంటింగ్ కేంద్రాల వద్ద మూడంచెల భద్రత

- జిల్లా వ్యాప్తంగా 144 సెక్షన్ అమలు
- విజయోత్సవ ర్యాలీలు, మందుగుండు సామగ్రి వినియోగానికి అనుమతుల్లేవు
- ఎలక్ట్రానిక్ పరికరాలు తీసుకుని కౌంటింగ్ కేంద్రాలకు రావద్దు
- శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చట్టపరమైన చర్యలు

విజయనగరం క్రైమ్:

సార్వత్రిక ఎన్నికలు ముగిసిన అనంతరం జూన్ 4వ తేదీన ఎన్నికల కౌంటింగ్ చేపట్టే జేఎన్‌టీయూ, లెండి ఇంజినీరింగ్ కళాశాలల వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా మూడంచెల భద్రతను ఏర్పాటు చేశామని ఎస్పీ ఎం.దీపిక తెలిపారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. కౌంటింగ్ హాల్‌లోకి ఎన్నికల సిబ్బంది, ఏజెంట్లు, మీడియా వారిని మాత్రమే అనుమతిస్తామని తెలిపారు. కౌంటింగ్ రోజు జిల్లా వ్యాప్తంగా 144 సెక్షన్ అమల్లో ఉంటుందన్నారు. విజయోత్సవ ర్యాలీలు, మందుగుండు సామగ్రిని వినియోగిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. జిల్లాలోని 100 సమస్యాత్మక గ్రామాల్లో పోలీస్ పికెట్ ఏర్పాటు చేస్తామని చెప్పారు. కౌంటింగ్ కేంద్రాల్లోకి వెళ్లే ఏజెంట్లు ఎలాంటి ఎల్రక్టానిక్ పరికరాలను తీసుకురావద్దన్నారు. ఏజెంట్లు, ఎన్నికల్లో పోటీచేసిన అభ్యర్థులు, ముఖ్య అధికారులు, వ్యక్తుల వాహనాల పార్కింగ్‌కు వేర్వేరుగా స్థలాలు కేటాయించామన్నారు. సమావేశంలో అదనపు ఎస్పీ అస్మా ఫర్హీన్, స్పెషల్ బ్రాంచ్ సీఐ కె.కె.వి.విజయనాథ్, వన్‌టౌన్ సీఐ బి.వెంకటరావు, తదితరులు పాల్గొన్నారు. ట్రాఫిక్ మళ్లింపు వివరాలను ఎస్పీ వెల్లడించారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ ఎం.దీపిక

కౌంటింగ్ రోజు ట్రాఫిక్ మళ్లింపు ఇలా..

- విశాఖ నుంచి విజయనగరం వైపు వచ్చే వాహనాలను మహారాజుపేట మీదుగా నాతవలస జాతీయ రహదారి వైపు, మోదవలస కూడలి వరకూ వచ్చిన వాహనాలను శిల్ప మెడికేర్ మీదుగా నాతవలస జాతీయ రహదారి వైపు మళ్లిస్తారు.
- విజయనగరం నుంచి విశాఖ వైపు వెళ్లే వాహనాలను వీటీ అగ్రహారం వై జంక్షన్ వద్ద చెక్ పోస్టును ఏర్పాటుచేసి రామనారాయణం మీదుగా కొత్తవలస లేదా పద్మనాభం వైపు మళ్లిస్తారు. అయినాడ జంక్షన్ వరకూ వచ్చే వాహనాలను చింతలవలస, గంట్లాం మీదుగా అక్కివరం జాతీయ రహదారి వైపు మళ్లిస్తారు.
- జొన్నాడ వరకూ వచ్చే వాహనాలను చింతలవలస, గంట్లాం మీదుగా అక్కివరం కూడలి వద్ద జాతీయ రహదారి వైపు మళ్లిస్తారు.
- గజపతినగరం నుంచి విశాఖ వైపు వెళ్లే వాహనాలను గొట్లాం బైపాస్ రోడ్డు మీదుగా కోరాడపేట బ్రిడ్జి కింద నుంచి చిన్నాపురం లేదా కొత్తవలస వైపు మళ్లిస్తారు. వాహనదారులందరూ ట్రాఫిక్ మళ్లింపుపై అవగాహన పెంచుకుని పోలీసులకు సహకరించాలని ఎస్పీ కోరారు.

క్లుప్తంగా

వస్త్ర దుకాణంలో అగ్ని ప్రమాదం



వస్త్ర దుకాణం నుంచి వస్తున్న దట్టమైన పొగలు

సాలూరు: పట్టణంలోని పెద్దబజారులో గల ఓ వస్త్ర దుకాణంలో శనివారం అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. విషయం తెలుసుకున్న అగ్నిమాపక శాఖాధికారులు సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ వల్ల ఈ ప్రమాదం జరిగిందని అధికారులు అనుమానం వ్యక్తం చేశారు. సుమారు ఐదు లక్షల రూపాయల ఆస్తినష్టం జరిగిందని దుకాణ యజమాని అలివేలు తెలిపారు.

రెండు లారీలు ఢీ..

- ఇద్దరికి గాయాలు



ప్రమాదంలో నుజ్జునుజ్జయిన లారీ ముందు భాగం

భామిని : మండలంలోని పారమ వద్ద నిలిచి ఉంచిన లారీని ఎదురుగా వస్తున్న మరో లారీ ఢీకొనండంతో ఇద్దరు గాయపడ్డారు. శనివారం వేకువజామున జరిగిన ఈ ప్రమాదంలో ఎదురుగా వచ్చి ఢీకొన్న లారీ డ్రైవర్, క్లీనర్‌కు గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను 108 వాహనంలో కొత్తూరు ఆస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం శ్రీకాకుళం రిమ్స్‌కు రిఫర్ చేశారు.

ఏపీఎన్‌జీవీఎఫ్ చైర్మన్‌గా తారకేశ్వరరావు



తారకేశ్వరరావు

విజయనగరం ఫోర్ట్: ఏపీఎన్‌జీవీఎఫ్(ఆంధ్ర ప్రదేశ్ నాన్‌గజిటెడ్ వెటర్నరీ ఫెడరేషన్) చైర్మన్‌గా సీహెచ్.తారకేశ్వరరావు ఎన్నికయ్యారు. అసోసియేషన్ కార్యాలయంలో రాష్ట్ర సంఘం ప్రధాన కార్యదర్శి బి.గోవిందరాజు, డి.కోదండరావు ఆధ్వర్యంలో శనివారం ఎన్నికలు నిర్వహించారు. ఇదివరకు ఏపీఎన్‌జీవీఎఫ్ చైర్మన్‌గా చేసిన పోల గోవిందరావు పదవీ విరమణ చేయడంతో ఆయన స్థానంలో నూతన చైర్మన్‌గా తారకేశ్వరరావును ఎన్నుకున్నారు.

నైపుణ్యాల పెంపుపై అధ్యాపకులు దృష్టి సారించాలి



మాట్లాడుతున్న సెంచూరియన్ వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ పల్లవి

నెల్లిమర్ల రూరల్: విద్యార్థుల్లో నైపుణ్యాలు పెంచే విధంగా అధ్యాపకులు కృషిచేయాలని సెంచూరియన్ వర్సిటీ వైస్ ప్రెసిడెంట్ ప్రొఫెసర్ డీఎన్ రావు అన్నారు. మండలంలోని టెక్కలి సెంచూరియన్ వర్సిటీలో అధ్యాపకులకు 'అభివృద్ధి కార్యక్రమం విజన్–2025' అనే అంశంపై శనివారం సెమినార్ నిర్వహించారు. జూమ్ సదస్సులో పాల్గొన్న డీఎన్ రావు మాట్లాడుతూ.. గత పదేళ్లల్లో భారత సంపద రెట్టింపు అయ్యిందని, మరో ఐదేళ్లలో మరింత రెట్టింపు అయ్యే అవకాశం ఉందన్నారు. అందుకు అనుగుణంగా అధ్యాపకులు సన్నద్ధం కావాలని సూచించారు. రిజిస్ట్రార్ డాక్టర్ పల్లవి మాట్లాడుతూ.. సెంచూరియన్‌లో విజన్–2025 కార్యక్రమం వారం రోజుల పాటు నిర్వహించనున్నట్లు చెప్పారు. అధ్యాపకులు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

లారీని ఢీకొన్న అంబులెన్స్

- రోగి మృతి

విజయనగరం క్రైమ్: ముందు వెళ్తున్న లారీని వెనుక నుంచి వస్తున్న 108 వాహనం ఢీకొనడంతో వాహనంలో ఉన్న రోగి మృతి చెందాడు. దీనికి సంబంధించి వన్‌టౌన్ పోలీసులు శనివారం అందించిన వివరాలిలా ఉన్నాయి. బాడంగి మండలం పీహెచ్‌సీ నుంచి ఫిట్స్ వ్యాధితో బాధపడుతున్న రాముసు (36)

జిల్లా కేంద్రాస్పత్రికి 108 వాహనంలో తీసుకువస్తున్నారు. స్థానిక సీతం కళాశాల జంక్షన్ వద్ద ముందు వెళ్తున్న తమిళనాడుకి చెందిన లారీని 108 వాహనం బలంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో 108 వాహనంలో ఉన్న రాము మృతి చెందగా.. అతని కుటుంబ సభ్యులు ఇద్దరు, ఉద్యోగికి తీవ్ర గాయాలయ్యాయి. మృతుని కుటుంబ సభ్యులిచ్చిన ఫిర్యాదు మేరకు వన్‌టౌన్ ఎస్సై తారకేశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹145	₹260	₹270

భీమాళి తాండ్ర భలే..

- నాణ్యతకు, రుచికి మారుపేరు
- వేసవి వచ్చిందంటే గ్రామంలో సందడే సందడి
- అనాదిగా మామిడి తాండ్ర తయారీ చేస్తున్న గ్రామస్తులు
- 400 కుటుంబాలకు జీవనాధారం



మామిడి తాండ్రి అమ్ముతున్న మహిళ



వెదురు చాపలపై వేసిన తాండ్ర పొరలు

లక్కవరపుకోట: వేసవి వచ్చిందంటే ఆ గ్రామంలో సందడే సందడి. ప్రతి ఇంటిలో చిన్నారుల నుంచి ముసలి వారి వరకు ఎండలో కష్టపడుతూ నోరూరించే మామిడి తాండ్ర తయారీలో బిజీగా ఉంటారు. రాష్ట్రంలో పలుచోట్లతో పాటు జిల్లాలో కూడా చాలా చోట్ల మామిడి తాండ్ర తయారు చేస్తుంటారు. అయినా లక్కవరపుకోట మండలం భీమాళి గ్రామంలో తయారు చేసిన తాండ్ర రుచే వేరు. నాణ్యతకు, రుచికి మారుపేరుగా భీమాళి తాండ్ర ఉంటుందని దేశ, విదేశాలకు చెందిన తాండ్ర ప్రియులు చెబుతుంటారు. ఈ గ్రామంలో సుమారుగా 400 కుటుంబాల వారు అనాధిగా తాండ్ర తయారు చేస్తుంటారు. దేశ, విదేశాల్లో ఉన్న వారు భీమాళి తాండ్ర తెప్పించుకొని మరీ తింటారు.

తయారీ విధానం

తాండ్రను ఎక్కువగా కలెక్టర్, కోలంగోవా వంటి రకాలతోనే చేస్తారు. ఈ రకం పండ్లను బాగ మగ్గ పెట్టి రసం తీస్తారు. తీసిన రసానికి సమపాలల్లో పంచదార కలిపి వెదురు కర్రతో చేసిన చాపలపై పొరలు పొరలుగా వేసి ఎండపెడతారు. ఆ విధంగా నెల రోజుల పాటు వేస్తారు. ఒక్కో చాప నుంచి 60 నుంచి 70 కిలోల దిగుబడి వస్తుంది.

టెంకలతో మామిడి అంట్లు

తాండ్ర చేసేందుకు వినియోగించిన పండ్ల నుంచి వేరుచేసిన టెంకలను వర్షాకాలం వచ్చే సమయంలో పాతర వేసి మొలక కట్టి మామిడి అంట్లుకు ఉపయోగిస్తారు. ఈ మొక్కలు కూడా మంచి దిగుబడి ఇస్తాయని పలువురు చెబుతున్నారు.



తాండ్ర తయారు చేసేందుకు సిద్ధం చేసిన మామిడి పండ్లు



మామిడి పండ్ల నుంచి గుజ్జును తీస్తున్న మహిళలు



మామిడి రసంలో పంచదారను కలుపుతున్న దృశ్యం

గిట్టుబాటు ధర అంతంతమాత్రమే..

మండుటెండల్లో ఎంతో కష్టపడి మామిడి తాండ్ర తయారు చేస్తున్నా గిట్టుబాటు ధర అంతంతమాత్రమే ఉందని తయారీదారులు చెబుతున్నారు. గతేడాదితో పోల్చుకుంటే వంద కిలోల పంచదార సుమారుగా 11 వందల రూపాయలు పెరిగింది. అలాగే తయారు చేసిన తాండ్రను నిల్వ చేసేందుకు కోల్డ్‌స్టోరేజ్‌లు లేకపోవడంతో ఎక్కువ కాలం నిల్వ చేయలేక, వచ్చిన ధరకు అమ్మాల్సిన పరిస్థితి వస్తోందని తయారీదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కోల్డ్‌స్టోరేజ్ నిర్మించాలని పలుమార్లు కోరినా ఎవ్వరూ పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. కూలీల వేతనాలు కూడా బాగా పెరిగిపోయాయి. ఎన్నో వ్యయప్రయాసలకోర్చి తాండ్రను తయారు చేస్తే కిలో రూ. 120 నుంచి 150 రూపాయల మధ్య విక్రయించాల్సి వస్తోందని, దీంతో చేతిలో పెద్దగా డబ్బులు మిగలడం లేదని తయారీదారులు చెబుతున్నారు.

అమ్మకపు పన్ను రద్దు చేయాలి

భీమాళి గ్రామంలో తాండ్ర తయారీ కుటీర పరిశ్రమగా నడుపుతున్నారు. రైతులు తయారు చేసిన తాండ్రపై అమ్మకపు పన్ను ఉండడంతో కొనుగోలుదారులు గ్రామాలకు రావడం లేదు. దీంతో కొనుగోలుదారుల వద్దకు రైతులే తీసుకెళ్లడంతో వారు అడిగిన ధరకు అమ్ముకోవల్సిన పరిస్థితి వస్తుంది. ఇప్పటికైనా జిల్లాకు, రాష్ట్రానికి ఇంత పేరు తీసకొచ్చే భీమాళి మామిడి తాండ్ర రైతులను ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుని సౌకర్యాలు కల్పించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

రామతీర్థంలో వైభవంగా హనుమాన్ జయంతి



ఆంజనేయ స్వామి సన్నిధిలో పూజలు జరిపిస్తున్న అర్చకులు

నెల్లిమర్ల రూరల్: సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థం సీతారామస్వామి దేవస్థానంలో హనుమాన్ జయంతి శనివారం అత్యంత వైభవంగా నిర్వహించారు. వేకువజామున స్వామికి ప్రాతః కాలార్చన, బాలభోగం నిర్వహించిన తర్వాత సీతారామస్వామి సన్నిధిలో ఉన్న ఆంజనేయ స్వామికి అర్చకులు విశేష అభిషేకాలు జరిపించారు. అనంతరం తమలపాకులు, సింధూరంతో అర్చనలు నిర్వహించి హనుమాన్ దండకం పఠించారు. ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి పలువురు ఆంజనేయస్వామి భక్తులు రామతీర్థం తరలివచ్చి భక్తి శ్రద్ధలతో మాల విరమణ చేశారు. ప్రత్యేక పూజలనంతరం ఆలయ అర్చకులు భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, పద్మావతి దంపతులు స్వామిని భక్తి శ్రద్ధలతో దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఈఓ శ్రీనివాసరావు, అర్చకులు సాయిరామాచార్యులు, నరసింహాచార్యులు, కిరణ్, తదితరులు పాల్గొన్నారు.



స్వామిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, పద్మావతి దంపతులు

కూరగాయల సాగు.. లాభాలు బాగు...

- జిల్లాలో 1500 హెక్టార్ల విస్తీర్ణంలో కూరగాయలు సాగు
- ఉత్తరాంధ్ర జిల్లాలతో పాటు ఉభయ గోదావరి జిల్లాలకు ఎగుమతి

పూసపాటిరేగ : మెట్ట పంటలైన చెరుకు, పొగాకు, జనపనార సాగుపై ఒకప్పుడు ఆధారపడిన రైతులు ప్రస్తుతం లాభాలు ఆర్జించే కూరగాయల సాగుపై మొగ్గు చూపుతున్నారు. ముఖ్యంగా ఖరీఫ్ సీజన్‌లో ప్రకృతి వైపరిత్యాలు సంభవించడంతో వరి, పత్తి, మినుమ సాగు చేసే రైతులు ప్రతి ఏటా నష్టపోతున్నారు. దీంతో ప్రత్యామ్నాయంగా కూరగాయల సాగుపై ఆసక్తి చూపిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా ఖరీఫ్ సీజన్‌లో సుమారు 1500 హెక్టార్లలో.. రబీ సీజన్‌లో 1000 హెక్టార్లలో కూరగాయలు సాగు చేస్తున్నారు. జిల్లాలో అత్యధికంగా రామభద్రపురం, జామి, నెల్లిమర్ల, మెంటాడ, పూసపాటిరేగ, బొండపల్లి మండలాలలో కూరగాయల సాగు జరుగుతోంది. ఇక్కడ పండిన కూరగాయలను ఉత్తరాంధ్ర జిల్లాలైన శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నంతో పాటు తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాలకు ఎగుమతి చేస్తుంటారు. తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు ఆర్జించే అవకాశం ఉండడంతో ఎక్కువ మంది రైతులు సాగుకు ముందుకు వస్తున్నారు. వర్షాకాలంలో తమ ప్రాంతంలో పండిన కూరగాయాలకు మంచి డిమాండ్ ఉంటోందని రైతులు చెబుతున్నారు.

రూ. లక్షకు పైబడి..

మండల పరిధిలో ఎక్కువగా బీర, బెండ, వంకాయి, చిక్కుడు, గోరు చిక్కుడు. గుమ్మడి, సొరకాయి, కర్రపెండలం, మునగ, క్యాబేజీ వంటి ఉద్యానవన పంటలు సాగు చేస్తున్నారు. ఎకరా కూరగాయలు సాగుకు 10 నుంచి 15 వేల రూపాయలు ఖర్చు కాగా.. అన్నీపోను ఎకరాకు లక్ష రూపాయల వరకు (రెండు నెలల పంట) ఆదాయం వస్తోందని రైతులు చెబుతున్నారు.



రోలుచప్పిడిలో సాగవుతున్న బీర పంట

రాయితీపై విత్తనాలు..

కూరగాయలు సాగు చేసే రైతులకు విత్తనాలు రాయితీపై అందజేస్తున్నాం. హెక్టారు విస్తీర్ణానికి సరిపోయే విత్తనాలపై ప్రభుత్వం రూ. 3 వేల వరకు రాయితీ ఇస్తోంది. హైబ్రిడ్ వెజిటబుల్ స్కీమ్ ద్వారా మరిన్ని రాయితీలు కల్పిస్తున్నాం. తీగజాతి కూరగాయలు సాగు చేసే రైతులకు శాశ్వత పందిళ్లు వేయడానికి ప్రభుత్వం సహకారం అందిస్తోంది.

– జ్యోత్స్న, ఉద్యానవనశాఖ అధికారి భోగాపురం.

మరిన్ని రాయితీలు ఇవ్వాలి..

కూరగాయలు సాగు చేసే రైతులకు మరిన్ని రాయితీలు ఇవ్వాలి. ఇతర పంటలకు మద్దతు ధర లేకపోవడంతో ఎక్కువ మంది కూరగాయలు సాగుపైనే ఆసక్తి చూపిస్తున్నారు. వర్షాకాలంలో పంట నష్టపోయిన రైతులకు ప్రభుత్వం పరిహారం ఇచ్చి ఆదుకోవాలి.

– ఆకుల మహలక్ష్మినాయుడు, రైతు, కనిమెల్ల

బీసీజీ టీకాలు శతశాతం వేయాలి

- జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి భాస్కరరావు

కొత్తవలస: క్షయవ్యాధిని నివారించాలనే ఉద్దేశంతో వయోజనులకు బీసీజీ టీకాలు శతశాతం వేయాలని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి ఎస్.భాస్కరరావు సూచించారు. మండలంలోని చింతలదిమ్మ, బలిఘట్టాం గ్రామాల్లో జరుగుతున్న టీకాల కార్యక్రమాన్ని శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈ కార్యక్రమం గత నెల 16న జిల్లాలో పైలెట్ ప్రాజెక్ట్‌లో భాగంగా ప్రారంభించినట్లు చెప్పారు. ఇప్పటివరకు మూడు వారాలు టీకాలు వేశామని.. మరో 9 వారాల పాటు వేస్తామని తెలిపారు. కార్యక్రమం నిర్వహణలో విజయనగరం జిల్లా రాష్ట్రంలోనే రెండో స్థానంలో ఉందన్నారు. కార్యక్రమం నిర్వహణలో సిబ్బంది అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. ఇప్పటివరకు క్షయవ్యాధి నివారణ టీకాలు చిన్నారులకు మాత్రమే వేసేవారమని...ప్రస్తుతం 18 సంవత్సరాలు పైబడిన వారందరికీ టీకాలు వేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కొత్తవలస పీహెచ్‌సీ వైద్యాధికారి సీతల్‌వర్మ, సీహెచ్‌ఓలు చంద్రశేఖర్‌రాజు, కృపా, హెల్త్ ఎడ్యుకేటర్ అనిల్‌ప్రేమకుమార్, పీహెచ్‌ఎన్ రమణమ్మ,హెచ్‌వీ బేబిరాణి, తదితరలు పాల్గొన్నారు.



బలిఘట్టంలో క్షయవ్యాధి నివారణ టీకా వేసుకున్న వ్యక్తి నుంచి వివరాలను సేకరిస్తున్న డీఎంహెచ్‌ఓ భాస్కరరావు

విద్యుత్ షాక్‌తో జేఎల్‌ఎం మృతి



బూరాడ మాధవరావు మృతదేహం

సంతకవిటి: మండల పరిధిలోని సిరిపురంలో బూరాడ మాధవరావు (31) అనే వ్యక్తి విద్యుత్ షాక్‌తో మృతి చెందారు. ఎస్సై షేక్ శంకర్ తెలిపిన వివరాల ప్రకారం .. సిరిపురం గ్రామానికి చెందిన బూరాడ జగదీశ్వరరావు, రెయ్యమ్మల రెండవ కుమారుడు బూరాడ మాధవరావు(31) మోదుగులపేట సచివాలయంలో జూనియర్ లైన్‌మన్‌గా విధులు నిర్వహిస్తున్నారు. శుక్రవారం రాత్రి గాలితో కూడిన వర్షం కురవడంతో సిరిపురం చెరువు వద్ద 11కేవీ తీగ తెగిపోవడంతో సిరిపురం లైన్‌మన్ గురుగుబెల్లి చిన్నారావు జేఎల్‌ఎం మాధవరావుకు విషయం తెలియజేశారు. దీంతో మాధవరావు సంఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదవశాత్తూ జారి తెగిన విద్యుత్ తీగపై పడి మృతి చెందాడు. మృతుడి తండ్రి జగదీశ్వరరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని రాజాం ఏరియా ఆస్పత్రికి తరలించారు.

అనుమానాస్పదంగా గుర్తు తెలియని వ్యక్తి..

బొబ్బిలి రూరల్: మండలంలోని రాముడువలస గ్రామ శివారులోని తోటపల్లి కాలువ గట్టు వద్ద అనుమానాస్పదంగా గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్టు ఎస్సై చదలవాడ సత్యనారాయణ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అలజంగి వీఆర్వో అప్పారావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు శనివారం సంఘటనా స్థలానికి వెళ్లి మృతదేహాన్ని పరిశీలించామన్నారు. మృతదేహం బాగా కుళ్లి, దుర్వాసన వస్తోందని చెప్పారు. మృతుడి వయసు 45 నుంచి 50 సంవత్సరాల మధ్య ఉంటుందని... మృతుడి ఒంటిపై లుంగీ, చొక్కా ఉన్నాయని తెలిపారు. మృతుడి ఆచూకీ కోసం చుట్టుపక్కల గ్రామాల్లో దండోరా వేయించినట్లు చెప్పారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై చదలవాడ తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి..



సామంతులు పైడిరాజు (ఫైల్)

గజపతినగరం రూరల్: మండలంలోని లోగిశ గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు సామంతుల పైడిరాజు చికిత్స పొందుతూ శనివారం మృతి చెందారు. బంధువులు తెలియజేసిన సమాచారం మేరకు... నాలుగు రోజుల కిందట బహిర్భూమికి వెళ్లిన సామంతులకు పాము కరిచింది. దీంతో ఆయన్ను జిల్లా కేంద్రంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి పడాల అరుణ, వైఎస్సార్‌సీపీ నాయకులు మండల సురేష్, కరణం ఆదినారాయణ తదితరులు సంతాపం వ్యక్తం చేశారు.